క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ పేలి మూడు పూరిళ్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిళ్లు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీలో మంగళవారం ఉదయం బాడితబోయిన అప్పారావు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించి మూడు ఇళ్లు దగ్ధమయ్యాయి. కొత్త సిలిండర్ మార్చిన అనంతరం గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అప్పారావు కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. అనంతరం సిలిండర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. బాధితులకు తాత్కాలికంగా పాత పంచాయతీ కార్యాలయంలో వసతి ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ షిణగం అప్పలరాజు చెప్పారు. మాజీ సర్పంచ్ కోరాడ రాము బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం, రూ.10వేల నగదు అందజేశారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు స్థల పరిశీలన



రుషికొండ వద్ద స్థలపరిశీలన చేస్తున్న ఆర్‌డీవో సంగీత్ మాథుర్ తదితరులు

కొమ్మాది: విశాఖ వేదికగా వచ్చేనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భీమిలి బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో యోగాసనాల కార్యక్రమం నిర్వహణకు స్థలాలను ఆర్‌డీవో సంగీత్ మాథుర్ మంగళవారం పరిశీలించారు. ఈ క్రమంలో రుషికొండలో గల ప్రేమ సమాజం స్థలాలను, చిన్న రుషికొండ, పెద్ద రుషికొండ బీచ్‌లను, ఐటీ హిల్స్ ప్రాంతాలను, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో సమీపంలో గల బీచ్ రోడ్డు, మంగమారిపేట, చేపలుప్పాడ వద్ద స్థలాలను, పలు రిసార్టులు, తీర ప్రాంతాలను పరిశీలించి, నివేదిక సిద్ధం చేస్తున్నామని ఆర్‌డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణ, నార్త్‌జోన్ ట్రాఫిక్ సీఐ సాయి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడకు సాయి ప్రేమ ప్రవాహిని వాహనం



వాహనంలో సత్యసాయి పాదుకలు

మధురవాడ: సత్య సాయి బాబా శత జయింతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తి నుంచి సాయి పాదుకులతో బయలుదేరిన సత్యసాయి ప్రేమ ప్రవాహిని వాహనం మంగళవారం మధురవాడకు చేరుకుంది. మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డులో ఈ వాహనానికి భక్తులు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా ఉడా కాలనీ భజన మండలి, ఇతర మందిరాలకు తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామి పాదుకలకు పూజలు చేశారు. సత్యసాయిబాబా ఆశీస్సులు అందించే టట్టు ఉండే చిత్రం, పాలరాతి పాదుకలతో ఈ ఉన్న వాహనం అన్ని సాయి మందిరాలు సందర్శిస్తోందని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలో 94లో మందిరాలను సందర్శించి ఇతర జిల్లాలకు వెళ్తుందని చెప్పారు. ఇందులో పలువురు సాయి భక్తులు పాల్గొన్నారు.

అంధకారంలో సర్వీసు రోడ్లు

పీఎం పాలెం: స్థానిక కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది కూడలికి వెళ్లే జాతీయ రహదారి సర్వీసు రోడ్లలో అంధకారంరాజ్యమేలుతోంది. రాత్రివేళ ఈ రహదారుల్లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు రెండు కిలో మీటర్ల సర్వీసు రోడ్లు నిర్మించారు. రోడ్డు పొడవునా నిర్మించిన ఫుట్ పాత్‌లు కొన్ని చోట్ల నడవడానికి అనుకూలంగా లేక పోవడంతో పాదచారులు కూడా సర్వీస్ రోడ్డులోనే నడుస్తుంటారు. పలు చోట్ల స్తంభాలకు దీపాలు లేవు. ఎప్పుడూ పూర్తి స్థాయిలో ఈ రోడ్లలో దీపాలు వెలగడం లేదు. దీంతో చీకటి పడితే చాలు ఈ రోడ్లలో అంధకారం అలుముకుంటోంది. రోడ్డు దాటుతున్న వ్యక్తులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే వీధి దీపాలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

బీఎస్ఎన్ఎల్ జోష్



భీమిలిలోని బీఎస్ఎన్ఎల్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్

- భీమిలి ప్రాంతంలో మెరుగుపడిన సేవలు
- పెరుగుతున్న ఆదరణ
- కొత్త కనెక్షన్‌ల కోసం ఆసక్తి చూపుతున్న వినియోగదారులు

భీమునిపట్నం: బీఎస్ఎన్ఎల్...ఒకప్పుడు ఒక వెలుగువెలిగి, గత కొన్నాళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ. ప్రైవేటు నెట్‌వర్క్‌ల హవా పెరగడంతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య దారుణంగా పడిపోయింది. అయితే ఇప్పుడు నాణ్యమైన సేవలందిస్తుండడం పాటు ప్రైవేటు టెలికాం కంపెనీలు ఇష్టానుసారంగా టారిఫ్‌లు పెంచడంతో భీమిలి ప్రాంతానికి చెందిన పలువురు వినియోగదారలు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి మారుతున్నారు. భీమిలిలో ప్రధాన కార్యాలయం ఉండగా, దీని పరిధిలో ఒకప్పుడు తగరపువలస, ఆనందపురం, పద్మనాభం, రేవిడి,రెడ్డిపల్లి, కౌంత్యాం, కాపులుప్పాడ, కళింగ ప్రాంతాల్లో ఎనిమిది ఎక్స్ఛేంజ్‌లు ఉండేవి. భీమిలి కార్యాలయంతోపాటు అన్ని ఎక్స్ఛేంజ్‌ల సిబ్బంది ఆయా పరిధుల్లో నిర్వహణ పనులు చూసుకునేవారు. ఒకప్పుడు వందల సంఖ్యలో ఉన్న ల్యాండ్ లైన్ కనెక్షన్‌లు ఇప్పుడు పదుల సంఖ్యలోకి వచ్చేశాయి.

మూకుమ్మడి ఉద్యోగ విరమణతో ...

అసలే అంతంత మాత్రంగా సేవలను అందిస్తున్న తరుణంలో ఐదు సంవత్సరాల క్రితం ఉన్న 18 మంది సిబ్బందిలో 16మంది మూకుమ్మడిగా స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. సూపరింటెండెంట్ ఇంజినీరు ఒకరు , జేఈ ఒకరు, ఆఫీస్ సూపరింటెండెంట్లు ఇద్దరు, టెలికాం టెక్నీషియన్లు ఎనిమిది మంది, అసిస్టెంట్ టెలికాం టెక్నీషియన్లు నలుగురు ఉద్యోగ విమరణ చేయడంతో కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారు. ఆయా ప్రాంతాల్లోని ఎక్స్ఛేంజ్‌లు కూడా మూతపడ్డాయి. కాగా మిగిలిన ఇద్దరితో కార్యాలయ నిర్వహణ చాలా ఇబ్బందికరంగా మారింది. టవర్లు సరిగ్గాలేకపోవడం, యంత్రాలు పాడైపోవడం తదితర కారణాలతో ఇది మూతపడే స్థితికి చేరుకుంది.

దీనస్థితి నుంచి...

దీనస్థితికి చేరుకున్న బీఎస్ఎన్ఎల్‌ను గాడిలో పెట్టేందుకు గత మూడు సంవత్సరాలుగా అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ నలుగురు సిబ్బంది ఉన్నారు. జూనియర్ టెలికాం అధికారి ఒకరు, ఇద్దరు జేఈలు, ఒక అసిస్టెంట్ టెలికాం టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం భీమిలి, ఆనందపురం, పద్మనాభం పరిధి మొత్తం 2,734 మొబైల్ కనెక్షన్‌లు ఉన్నాయి. గతంలో 12 టవర్లు ఉండగా ఇటీవల రెండు కొత్త టవర్లు ఏర్పాటు చేయడంతో మొత్తం 14టవర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ మంచి సిగ్నల్ ఫ్రీక్వెన్సీలతో పని చేస్తున్నాయి. గతంలో ప్రతి నెలా 20 నుంచి 30 వరకు మాత్రమే కొత్త కనెక్షన్‌లు వస్తుండగా ఇప్పుడు నెలకు 60 నుంచి 80 మందికి పైగా కనెక్షన్‌లు తీసుకుంటున్నారు. ప్రైవేటు నెట్‌వర్క్‌ల కన్నా తక్కువ ధరలు, ఎక్కువ ఇంటర్‌నెట్ జీబీ వచ్చే ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ ప్లాన్లు ఉండడం పేద, మధ్య తరగతి వారికి ఎంతో సదుపాయంగా ఉంది. మూడు సంవత్సరాల నుంచి ఫైబర్ నెట్ వర్క్ అందుబాటులోకి రావడంతో మరింత హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీంతో పాటు పలు ఓటీటీల ఆఫర్లుకూడా ఆయా పోస్ట్ పెయిడ్ ప్లాన్లలో అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు 4 జీ అందుబాటులోకి ఉంది. ఇదేకాకుండా కేస్ 6 ప్లాన్ అందుబాటులో ఉంది. దీని ప్రకారం ఒకే చోట వంద ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాల్లోని వారు బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌లు తీసుకుంటే వారి ప్లాన్‌లకు పదిశాతం రాయితీ ఇస్తున్నారు. ఇలా పలు విధాలుగా అందుబాటులో ఉన్న సదుపాయాల వల్ల గతంలోకన్నా ఇప్పుడు ఆదాయం పెరిగింది.

కస్టమర్ సర్వీస్ సెంటర్ ద్వారా సేవలు

ఇక్కడ కస్టమర్ సర్వీస్ సెంటర్ అందుబాటులో ఉంది. ఈ కేంద్రంలో కొత్త బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు పొందడంతో పాటు ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ బిల్లులు, ఫైబర్ నెట్ వర్క బిల్లులు చెల్లించవచ్చు. కొత్త ఆధార్‌కార్డులు పొందడం, ఆధార్ అనుసంధానం, తప్పులు సరిచేయడం మొదలైన సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పుడు ప్రైవేట్ నెట్ వర్క్‌లకు ధీటుగా సేవలను అందిస్తుండడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారు.



కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌లో సేవలు పొందుతున్న వినియోగదారులు



కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌లో సిబ్బంది

నెట్‌వర్క్ సిగ్నల్ బాగుంది



ఇంతకు ముందు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సిగ్నల్ సరిగ్గా ఉండేది కాదు. దీంతో ఇంటర్‌నెట్ సేవలు పొందడానికి ఇబ్బందులు పడవలసి వచ్చేది. కానీ ఇప్పుడు అటువంటి సమస్యలు. లేవు సిగ్నల్ చాలా బాగుండడంతో అన్ని ప్రాంతాల్లోను బాగా పని చేస్తోంది.

– జరజాపు ప్రసాద్, భీమిలి

చార్జీలు తక్కువ



పలు రీచార్జ్ ప్లాన్ల చార్జీలు తక్కువగా ఉన్నాయి. ప్రైవేట్ నెట్ వర్క్‌లు చార్జీలను బాగా పెంచేశాయి. అంతమొత్తాలను చెల్లించే పరిస్థితుల్లో విని యోగదారులు లేరు. బీఎస్ఎన్‌లో తక్కువ చార్జీలతో అందజేస్తున్న సేవలు అందరికీ లాభదాయకంగా ఉన్నాయి.

– టి. వెంకటేష్, మామిడిపాలెం

ప్రత్యేక శ్రద్ధతో సేవలు



వినియోగదారులకు సేవలను అందించే విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిగ్నల్ సమస్యలు రాకుండా అవరసమైన అన్ని జాగ్రత్తలు, చర్యలను చేట్టాం. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఫిర్యాదులు వచ్చిన వెంటనే జాప్యం చేయకుండా పరిష్కరిస్తున్నాం. ముఖ్యంగా ప్రైవేటు సంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు పని చేస్తోంది.

– పి.చంద్రశేఖర్, జూనియర్ టెలికాం అధికారి, భీమిలి

భవిత.. దివ్యాంగులకు బాసట



పద్మనాభంలో దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వేను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఏపీసీ చంద్ర శేఖర రావు

పద్మనాభం: భవిత కేంద్రాలు దివ్యాంగ విద్యార్థుల బాసటగా నిలుస్తున్నాయని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జె.చంద్ర శేఖరరావు అన్నారు. పద్మనాభంలో మంగళవారం జరిగిన దివ్యాంగ విద్యార్థుల సర్వేను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21 రకాల వైకల్యాలు కలిగిన 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తామన్నారు. ఈ సర్వే ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జూన్ తొమ్మిదో తేదీన సర్వే ముగిస్తుందన్నారు. దివ్యాంగ విద్యార్థులను మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రాలకు పంపిస్తే ఉపకార వేతనాలు, ట్రాన్స్‌పోర్టు అలవెన్సు ఇస్తామన్నారు. భవత కేంద్రంలో ఉచితంగా ఫిజియో థెరపీ చేయిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా పద్మనాభం, కృష్ణాపురం గ్రామాల్లో సర్వేలో గుర్తించిన ఇద్దరు దివ్యాంగ విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈవో పొన్నగంటి రమణను ఆదేశించారు. అనంతరం పద్మనాభం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. తదుపరి రెడ్డిపల్లిలో ఉన్న ఎస్ఆర్‌కేవీఎం స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోడపై అంబేడ్కర్, గాంధీజీ, భరత మాత బొమ్మలను అందంగా చిత్రీకరించిన ఆర్ట్ పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ మజ్జి గౌరిని అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ అభినందించారు. ఆయన వెంట సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ బి.గీత, ఏపీవో అప్పలనాయుడు, ఎంఈవో పొన్నగంటి రమణ, ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్.రాజ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

ముంపు ప్రాంతాల్లో జెడ్సీ పర్యటన

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో మంగళవారం వేకువజామున కురిసిన వర్షాలకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. యథావిధిగా సబ్బివానిపేట వద్ద సర్వీస్‌రోడ్డుపై నీరు నిలిచిపోగా పల్లపు ప్రాంతాలైన ఆదర్శనగర్, టీచర్స్ కాలనీ, గాంధీబొమ్మవీధి, ఉప్పాడపేట, ఇడదాసరిపేట, సంగివలస, బాలాజీనగర్, రామన్నపేట ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పాలిథిన్ కవర్లు, సీసాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఇతర వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగు రహదారులపై ప్రవహించింది. జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు పలుచోట్ల డ్రైనేజీల్లో పూడిక తొలగింపు పనులు పర్యవేక్షించారు. పారిశుధ్య సిబ్బంది, శానిటేషన్ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట శానిటరీ ఇనస్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, వివిధ సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ పరీక్షల్లో ఓక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



జెబెయిన్ హస్మి



వీరమాచనేని అన్య

తగరపువలస: కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ–2025 పరీక్షల్లో భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జుబెయిన్ హస్మి, వీరమాచనేని అన్య ప్రతిభ కనబరిచారు. జుబెయిన్ హస్మి ఎనిమిది సబ్జెక్టుల్లో 8 ఎ ప్లస్‌గ్రేడ్లు సాధించగా, అన్య ఆరు సబ్జెక్టులలో ఎ ప్లస్, రెండు సబ్జెక్టులలో ఎ గ్రేడ్ సాధించారు. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థుల్లో 21.5 శాతం మంది ఎ నుంచి ఎ ప్లస్ గ్రేడ్లు సాధించి సత్తా చాటినట్టు ఓక్రిడ్జ్ యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ ఈ విద్య తమ విద్యార్థులలో విశ్లేషణాత్మక ఆలోచన, ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై అవగాహన, ప్రాక్టికల్ జ్ఞానాన్ని అభివృద్ధి చేసేలా రూపొందించబడిందన్నారు. అంతర్జాతీయ విద్యలో ప్రతి ఏటా తమ విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

రైతు బజారులో విక్రయాలు ప్రారంభం



రైతు బజారులో విక్రయాల ప్రారంభ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డులో రూ.78 లక్షలతో నిర్మించి, ప్రారంభించిన చిట్టివలస రైతు బజారులో విక్రయాలను మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని రైతులకు, అధికారులకు సూచించారు. ఇందులో రైతులకు 32 స్టాళ్లు, 5 కమర్షియల్ దుకాణాలు ఉన్నాయన్నారు. అనంతరం టాయిలెట్లు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు.ఎప్పటి నుంచో ఈ ప్రాంతవాసుల రైతుబజారు కల ఫలించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, భీమిలి జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు పరాభవం..

నెలరోజుల క్రితం భీమిలి ఏఎంసీ చైర్మన్ పదవిని కూటమి ప్రభుత్వం పద్మనాభం మండలానికి చెందిన జనసేన నాయకుడు కురిమిన రామస్వామినాయుడుకు కేటాయించారు. కానీ మంగళవారం జరిగిన రైతుబజారులో విక్రయాల ప్రారంభానికి మార్కెట్ కమిటీ అధికారులు ఆయనకు సమాచారం అందించలేదు. ప్రమాణ స్వీకారం జరగలేదని, అందుకే ఆహ్వానించలేదని కొందరు కూటమి నాయకులు అంటే అసలు రైతుబజారులో విక్రయాలు ప్రారంభించినట్టే తనకు తెలియదని చైర్మన్ రామస్వామినాయుడు తెలిపారు.

వానొస్తే నరకమే

- వాగులను తలపించేలా రోడ్లు
- మురుగునీటిలో తప్పని రాకపోకలు
- తీవ్ర అవస్థలకు గురవుతున్న మధురవాడ వాసులు



వర్షం, మురుగు నీటిలో చిక్కుకుని ఆగిపోయిన వాహనంతో పాట్లు

మధురవాడ: చిన్నపాటి వర్షం పడినా మధురవాడ వాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్లు జలమయమవుతుండడంతో పాటు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో ఆ నీటిలో వాహనాలు నడిపేందుకు అష్టకష్టాలు పడవలసి వస్తోంది. మంగళవారం ఉదయం కురిసిన తేలిక పాటి వర్షానికే మధురవాడలో లోతట్టు ప్రాంతాల్లోనే కాదు, కొండల మీద ఉన్న రోడ్లపై కూడా నీరు నిలిచిపోయింది. ఎండాడ లా కాలేజీ–పనోరమ హిల్స్ రోడ్డులో లా కాలేజీ, పనోరమ హిల్స్ విల్లాల వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు పైనే భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. వర్షం ఆగిన పోయిన రెండుగంటల తరువాత కూడా మధురవాడ అప్ బ్రిడ్జికి ఇరువైపులా మోకాలు పైబడి మురుగు, వర్షం నీరు ఏకమై రోడ్డుపై నిలిచిపోయింది. సైలెన్సర్లలోకి నీరు వెళ్లిపోవడంతో కొన్ని వాహనాలు ముగరుగు నీటి మధ్యలో మొరాయించి ఆగిపోవడంతో వాహనచోదకులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం.

మధురవాడ డైలీ మార్కెట్, చంద్రంపాలెం, రేవళ్లపాలెంల వద్ద పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఇక్కడ మురుగునీరు రోడ్డుపైకి వచ్చేయడం సర్వసాధారణం. ఇక వర్షం కురిస్తే ఎంత దుర్భరంగా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు. చిన్నపాటి వర్షంకురిసినా ఈ ప్రాంతం మురుగు మయంగా మారడంతో పాటు తీవ్ర దుర్గంధం వెలువడుతుండడంతో స్థానికులు నరకయాతన పడుతున్నారు.



మురుగు నీటిలోంచే రోడ్డు దాటుతున్న వ్యక్తి



ఎండాడ పనోరమ హిల్స్ విల్లాస్ సమీపంలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన వాహనాలు



ఎండాడ లా కాలేజీ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డుపై నిలిచిపోయిన నీరు

శాకంబరిగా రాస పోలమాంబ



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని 107వ అలంకరణలో భాగంగా మంగళవారం శాకంబరిగా అలంకరించారు. ఇందుకు 11 రకాల కూరగాయలు, ఆకుకూరలు వినియోగించారు. ఈ అలంకరణకు గాను మజ్జివలస కళ్లాలకు చెందిన కాగితాల సూర్యనారాయణ, నాగమ్మ దంపతులు సహాయ సహకారాలు అందించారు. ఆలయానికి వచ్చే భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. చిప్పాడ దివీస్ రహదారిలో గుడివాడ తోగాలమ్మ, ముత్యాలమ్మ గ్రామదేవతలను ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవార్లను చుట్టుపక్కల గ్రామాల భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వర్షం నీటితో నిలిచిపోయిన రాకపోకలు



వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెం, పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ పలు గ్రామాలకు వెళ్లే రహదారిలో వర్షం నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఇక్కడ ఉన్న చిన్నపాటి వంతెనపై నుంచి భారీ స్థాయిలో నీరు ప్రవహించడంతో ఇటుగా వెళ్లడానికి స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు బ్రిడ్జ్ ఏర్పాటు చేస్తామని నాయకులు ఇచ్చిన హామీలు నీట్టి మాటలుగా మిగిలిపోయాయి. చిన్న పాటి వర్షానికే రాకపోకలు నిలిచిపోతుంటే రాకపోకలు ఎలాసాగించాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి ఫీడర్‌లో వ్యవసాయ, వ్యవసాయేతర లైనులు విభజించే పనులు చేపట్టనున్నందున ఈ ఫీడర్ పరిధిలోని పాండ్రంగి, మునివాపాలెం, సామయ్యవలస గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏఈ జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ అనుపు ఉత్సవం



కృష్ణాపురంలో కోలాటం ఆడుతున్న మహిళలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో మొకర వారి ఇలవేల్పు దుర్గాలమ్మ అనుపు ఉత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారి రథాలను గ్రామంలో మూడు సార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అమ్మవారి ఆలయం, ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

యాతపేటలో..

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ యాతపేటలో మంగళవారం సాయంత్రం అసిరితల్లి, వేమాలమ్మ, బంగారమ్మ తదితర అమ్మవార్ల అనుపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాణసంచా, నేలవేషాలు, పులివేషాలతో అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. జీవీఎంసీ భీమిలి జోన్ చిల్లపేట, జీరుపేట, చిట్టివలస తదితర తొమ్మిది గ్రామాల ప్రజలు చిట్టివలస పోలమ్మకు పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.